సాక్షి
జనగామ

గురువారం । 24 । ఆగస్టు । 2023



బది'లీలలు' -10లో▸

నబ్ రిజిస్ట్రార్ల బదిలీల్లో భారీగా ముడుపులు చేతులు మారినట్లు సమాచారం. ఉన్నతాధికారుల ఆశీర్వాదంతో నచ్చిన దగ్గర పోస్టింగ్ పొందినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.



దివ్యాంగులకు మరింత ఆసరా

రాష్ట్ర ప్రభుత్వం దివ్యాంగులకు ఆసరా పింఛన్ పెంచి ఆదుకుంటుందని మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. -10లో▸

గరిష్టం/కనిష్టం
$30^0/24^0$

వాతావరణం

జిల్లాలో వాతావరణం పొడిగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండ మామూలుగా ఉంటుంది. సాయంత్రం చల్లగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

సూపరింటెండెంట్ల బాధ్యతల స్వీకరణ



జనగామ: జనగామ ప్రభుత్వ జనరల్, ఎంసీహెచ్ ఆస్పత్రుల సూపరింటెండెంట్లు ప్రొఫెసర్ డాక్టర్ అనురాధ, ప్రొఫెసర్ డాక్టర్ మధుసూదన్‌రెడ్డి బుధవారం బాధ్యతలను స్వీకరించారు. మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్, ప్రొఫెసర్ డాక్టర్ గోపాల్‌రావు, డీసీహెచ్‌ఎస్ డాక్టర్ సుగుణాకర్‌రాజు, ఆర్‌ఎంఓ డాక్టర్ శంకర్, డాక్టర్ అన్వర్, టీఎన్‌జీఓ జిల్లా అధ్యక్షుడు ఎండీ ఖాజాషరీఫ్ తదితరలు వారికి శుభాకాంక్షలు తెలిపారు. అనంతనం కలెక్టర్ సీహెచ్ శివలింగయ్యను మర్యాద పూర్వకంగా కలిసి, పుష్పగుచ్ఛం అందజేశారు.

దరఖాస్తుల ఆహ్వానం

జనగామ రూరల్: సీఎం విదేశీ విద్య ఉపకార వేతనాల పథకానికి అర్హులైన మైనార్టీల నుంచి ప్రభుత్వం దరఖాస్తులు దాహ్వానిస్తుందని జిల్లా మైనార్టీ సంక్షేమాధికారి సయ్యద్ ఇస్మాయిల్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. యూఎస్, యూకే, ఆస్ట్రేలియా, కెనడా, సింగపూర్, జర్మనీ, సౌత్ కోరియా, జపాన్ , ఫ్రాన్స్, న్యూజిలాండ్ వంటి దేశాల్లో విశ్వవిద్యాలయాల్లో పోస్ట్‌గ్రాడ్యూయేషన్, పీహెచ్‌డీ కోర్సులు అభ్యసించడానికి అవకాశం ఉందని తెలిపారు. ఈనెల 22వ తేది నుంచి సెప్టెంబర్ 21 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. నమోదు అనంతరం సంబంధిత హార్డ్ కాపీని కలెక్టరేట్‌లోని రూం నంబర్ ఎఫ్ 25 మైనార్టీ శాఖ కార్యాలయంలో సమర్పించాలని తెలిపారు.

దివ్యాంగులకు పెరిగిన పింఛన్

పాలకుర్తి/పాలకుర్తి టౌన్: దేశంలో ఎక్కడా లేని విధంగా దివ్యాంగులకు మన ప్రభుత్వంలో ఎక్కువ మొత్తం అందజేస్తున్నామని మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. బుధవారం పాలకుర్తిలో మంత్రి క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన దివ్యాంగుల పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో మంత్రి పాల్గొని మాట్లాడారు. దయాకర్‌రావు పాలకుర్తి నియోజకవర్గంలో సుడిగాలి పర్యటన వలే దివ్యాంగులకు పెరిగిన పింఛన్లను పంపిణీ చేశారు. మహరాజు కోణంలో ఆలోచించిన సీఎం కేసీఆర్ ఇప్పటికే రూ.4వేలకు పైగా పెంచినట్లు తెలిపారు. కార్యక్రమంలో డీఆర్‌డీఓ రాంరెడ్డి, అసిస్టెంట్ ఏపిడివో జనార్దన్, ఎంపీపీ జనార్దన్, ఎంపీడీఓ అశోక్‌కుమార్, జెడ్పీటీసీ పుస్కారి శ్రీనివాస్‌రావు, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు మదార్, సహకార సొసైటీ చైర్మన్ అశోక్‌రెడ్డి, దివ్యాంగుల సంఘం నాయకులు రావుల సత్యనారాయణ, కడుదుల కర్నాకర్ రెడ్డి, వికలాంగుల సంఘం పాల్గొన్నారు.

సంస్మరణ సభను విజయవంతం చేయాలి



జనగామ రూరల్: ప్రజా గాయకుడు గద్దర్ సంస్మరణ సభను విజయవంతం చేయాలని అఖిల భారత మహాసభ జిల్లా అధ్యక్షుడు బనుక సిద్దిరాజ్ అన్నారు. బుధవారం పట్టణంలోని ఆర్ అండ్‌బీ గెస్ట్ హౌజ్ వద్ద వాల్ పోస్టర్ ఆవిష్కరించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. నిత్యం ప్రజల పక్షాన తన గొంతును వినిపించిన గొప్ప మహనీయుడు గద్దర్ అని కొనియాడారు. గురువారం జనగామలోని వైఎస్ఎస్ఆర్ భవన్‌లో జాతీయ మానవ హక్కుల వేదిక, బహుజన విద్యార్థి వేదిక ఆధ్వర్యంలో సంస్మరణ సభ నిర్వహిస్తున్నామని యాసారపు కర్నాకర్, తాళ్లపల్లి శివరాం రాష్ట్ర తెలిపారు. ఈకార్యక్రమంకు గద్దర్ కుమారుడు, సూర్యం, కూతురు వెన్నల విమలక్క, ఏపూరి సోమన్న, రానున్నారని కవులు, కళాకారులు, రచయితలు, ప్రజా సంఘాల వారు, మేధావులు క్రమంలో ఎంపీపీ మేకల కళింగరాజు, కొమురయ్య, శివరాజ్, ప్రశాంత్ వన రాజు, వెంకటేష్, యాకన్న, తదితరులు పాల్గొన్నారు.

జయహో ఇస్రో

జైకొట్టిన జనగామ ప్రజలు, విద్యార్థులు

- బాణసంచా కాల్చి వేడుకలు



జనగామ: భారత్ మరో చరిత్ర సృష్టించింది. చంద్రయాన్-3 ప్రయోగించిన 40 రోజుల తర్వాత ఇస్రో శాస్త్రవేత్తల కృషి ఫలించింది. ప్రపంచం మొత్తం విక్రమ్ సాఫ్ట్ ల్యాండింగ్‌ను బుధవారం ప్రత్యక్ష ప్రసారం ద్వారా వీక్షించగా.. జనగామ జిల్లా ప్రజలు టీవీలకు అతుక్కుపోయారు. సాయంత్రం 5.44 గంటలకు ఇస్రో సాఫ్ట్ ల్యాండింగ్ ప్రక్రియను మొదలు పెట్టగా.. 6.04 గంటలకు చంద్రుడిపై సేఫ్‌గా దిగింది. ఈ అరుదైన క్షణంలో టీవీల ముందు కూర్చున్న విద్యార్థులు, యువత, ఉద్యోగ, ఉపాధ్యాయులు, అన్ని వర్గాల ప్రజలు.. శాస్త్రవేత్తల కృషిని ప్రశంసిస్తూ చప్పట్లతో అభినందనలు తెలిపారు. టీవీలు అందుబాటులో లేని పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాల్లో పని చేసే ప్రతి ఒక్కరు సెల్‌ఫోన్‌లో సాక్షి టీవీలో ప్రసారం చేసిన ప్రత్యక్ష ప్రసారం ద్వారా వీక్షించారు. చివరి 4 నిమిషాల పాటు రోవర్ కిందకు దిగే ఉద్విగ్న సమయంలో టీవీల ఎదుట ఉన్న వారంతా ఊపిరి బిగపట్టి దేవుళ్లను ప్రార్థించారు. జిల్లా వ్యాప్తంగా పండగ వాతావరణం నెలకొంది. కాగా, జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ చౌరస్తాలో వారణాసి పవన్‌శర్మ, తదితరుల ఆధ్వర్యంలో బాణాసంచా కాల్చి సంబురాలు జరుపుకున్నారు.



జ్యోతినగర్‌లో చంద్రయాన్-3 ప్రత్యక్ష ప్రసారం వీక్షిస్తున్న చిన్నారులు



ఆర్టీసీ చౌరస్తాలో సంబురాల్లో ప్రజలు

చంద్రయాన్ విజయంలో హనుమకొండ జంట



ప్రవీణ్ రెడ్డి



సుష్మ

హన్మకొండ: చంద్రయాన్-3 విజయవంతంలో హనుమకొండ జంట భాగస్వామ్యం ఉంది. నగరంలోని అశోక కాలనీకి చెందిన గొట్టిముక్కుల ప్రవీణ్‌రెడ్డి, సుష్మ దంపతులు ఇస్రోలో శాస్త్రవేత్తలుగా పనిచేస్తున్నారు. గొట్టిముక్కుల రమాదేవి, మన్మథరెడ్డిల కుమారుడు ప్రవీణ్‌రెడ్డి 2011 సెప్టెంబర్ 16నుంచి బెంగళూర్‌లోని ఇస్రో ప్రధాన కార్యాలయంలో శాస్త్రవేత్తగా పనిచేస్తున్నారు. మూడు పదోన్నతులు పొంది ప్రస్తుతం డైరెక్టర్ హోదాలో ఉన్నారు. ఆయన సతీమణి సుష్మ కూడా ఇస్రోలోనే శాస్త్రవేత్తగా పనిచేస్తున్నారు. విక్రమ్ రోవర్ చంద్రుడిపై అడుగిడడంలో ఇతర శాస్త్రవేత్తలతో కలిసి వీరు పాలు పంచుకున్నారు. విక్రం ల్యాండర్ చంద్రుడిపై విజయవంతంగా దిగగానే తన కోడలు ఫోన్ చేసి విషయం చెప్పిందని, ఎంతో సంతోషంగా ఉందని చెప్పిందని మామ గొట్టిముక్కుల మన్మథరెడ్డి తెలిపారు. మన్మథరెడ్డి పోలీస్‌శాఖ ఏఆర్ విభాగంలో హెడ్ కానిస్టేబుల్‌గా రిటైరయ్యారు.

చంద్రయాన్-3లో సోమ్లతండా వాసి



శాస్త్రవేత్త భూక్య రమేష్

మహబూబాబాద్ రూరల్ : మహబూబాబాద్ మండలం సోమ్లతండా గ్రామానికి చెందిన భూక్య రమేష్ ఇస్రోలో శాస్త్రవేత్తగా పనిచేస్తున్నారు. చంద్రయాన్-3 ప్రయోగం సందర్భంగా ఇస్రోలోని ప్రధాన శాస్త్రవేత్తలతో కలిసి రమేష్ కూడా పాల్గొన్నారు. వ్యవసాయ కుటుంబానికి చెందిన భూక్య భీముడు, లక్ష్మి దంపతుల మూడవ కుమారుడు అయిన రమేష్ ఇస్రోలో నాలుగేళ్లుగా కమ్యూనికేషన్ విభాగంలో పని చేస్తున్నారు. చంద్రయాన్ 2, చంద్రయాన్ 3 ప్రయోగం సమయంలో ఇక్కడే ఉండడం తనకు ఎంతో గర్వంగా ఉందని రమేష్ చెప్పారు. ఈసారి విజయవంతం కావడం భారత దేశ ప్రజల గొప్పతనమని పేర్కొన్నారు.

అనుభూతి మరిచి పోలేనిది



చంద్రయాన్-3 చందమామను తాకే సమయంలో ఎంతో అనుభూతికి లోనయ్యా. మధ్యాహ్నం 2.30 గంటల నుంచే టీవీలో ప్రత్యక్ష ప్రసారం చూశాను. సాయంత్రం 6గంటల 4 నిమిషాలకు విక్రమ్ ల్యాండింగ్‌ను చూస్తున్న వేళ కళ్ల వెంట ఆనంద భాష్పాలు రాలాయి. అమ్మా, నాన్న, కుటుంబ సభ్యులు సైతం మనదేశ గొప్పతనాన్ని చూసి, మురిసి పోయారు. శాస్త్రవేత్తలకు శుభాకాంక్షలు.

- కార్తీక్, ఇంటర్ ఫస్ట్ ఇయర్

ప్రపంచ స్థాయిలో దేశ కీర్తిప్రతిష్టలు



చంద్రయాన్-3 ప్రయోగం విజయవంతం చేసిన భారత అంతరిక్ష శాస్త్రవేత్తలకు శుభాకాంక్షలు. ప్రపంచ దేశాల్లో భారత్ స్థానాన్ని నెంబర్-1గా చేయడంలో మన సైంటిస్టుల కృషి అభినందనీయం. రష్యా లూనా-25 విఫలమైన సమయంలో ప్రపంచ ప్రజల దృష్టి భారత్ ప్రయోగించే చంద్రయాన్-3ను ఆకర్షించింది.

- బాలరాజు, ఫిజిక్స్ ఉపాధ్యాయుడు, ధర్మకంచ, జనగామ

సైంటిస్టుగా ఇస్రోలో పనిచేస్తా..



చంద్రయాన్-3 దేశ గౌరవాన్ని మరింత పెంచింది. ప్రపంచంలోనే మొదటి సారిగా చంద్రుడి దక్షిణ ధ్రువం పై కాలుమోపిన దేశంగా చరిత్ర సృష్టించింది. చంద్రుడిపై ఉన్న వాతావరణ పరిస్థితులతో పాటు అక్కడ లభించే ఖనిజాలతో భవిష్యత్‌లో చంద్ర మండలంపై నివసించే అవకాశాలు లేకపోలేదు. భవిష్యత్‌లో సైంటిస్టుగా ఇస్రోలో ప్రయోగాలు చేయాలనే కోరిక ఉంది.

- స్పందన, 10వ తరగతి, చిన్నపెండ్యాల, చిల్పూరు

తెరపడేదెన్నడు..?

- గులాబీ అధినేతకు తలనొప్పిగా జనగామ, స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గాలు
- 'కడియం' సభకు హాజరు కాని ఎమ్మెల్యే రాజయ్య
- ప్రయత్నం చేసిన 'పల్లా'ను కలిసేందుకు నిరాకరణ
- జనగామపై పట్టు వదలని పల్లా, ముత్తిరెడ్డి, పోచంపల్లి



సాక్షిప్రతినిధి, వరంగల్: గులాబీ దళపతి, సీఎం కేసీఆర్‌కు జనగామ, స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గాలు తలనొప్పిగా మారాయి. ఉమ్మడి వరంగల్‌లో 12 అసెంబ్లీ నియోజకవర్గాలకు 11 చోట్ల అభ్యర్థులను ఖరారు చేశారు. జనగామ సిట్టింగ్ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరి రెడ్డి తిరిగి టికెట్ ఆశిస్తుండగా.. ఎమ్మెల్సీలు పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి, పల్లా రాజేశ్వర్ రెడ్డిలు సైతం పోటీ పడుతుండటంతో జనగామ టికెట్ ప్రకటన విషయాన్ని కేసీఆర్ ఆపేశారు. స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గంలో మాత్రం సిట్టింగ్ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్యను తప్పించి ఎమ్మెల్సీ కడియం శ్రీహరికి అవకాశం కల్పించారు. నియోజకవర్గంలో నాయకులు, కార్యకర్తలను కలిసిన ఎమ్మెల్యే రాజయ్య టికెట్ రాలేదన్న బాధలో కన్నీటి పర్యంతమయ్యారు. అయితే తాను సీఎం కేసీఆర్ మార్గదర్శనంలో ఆయన హామీలకు కట్టుబడి చేస్తానని ప్రకటించారు. ఇదిలాఉండగా.. అభ్యర్థిత్వం ఖరారైన నేపథ్యంలో కడియం శ్రీహరి స్టేషన్‌ఘన్‌పూర్‌లో బుధవారం నిర్వహించిన విస్తృత స్థాయి కార్యకర్తల సమావేశానికి ఎమ్మెల్యే రాజయ్య గైర్హాజర్ కావడం మళ్లీ బీఆర్ఎస్ వర్గాల్లో చర్చకు తెరలేపింది. కడియం శ్రీహరి సభకు హాజరు కావాలని సంప్రదింపులు జరిపేందుకు హనుమకొండలోని ఎమ్మెల్యే రాజయ్య ఇంటికి వెళ్లిన ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్ రెడ్డి ఆయన లేకపోవడంతో వెనుతిరిగారు. అనంతరం స్థానిక కార్యకర్తలు, రాజయ్య అనుచరులతో భేటీ అయిన పల్లా.. రాజయ్యకు బీఆర్ఎస్ అధిష్టానం సముచిత స్థానం కల్పిస్తుందని.. రెండు మూడు రోజుల్లోనే కేసీఆర్‌ను కలుస్తామని తెలిపినట్లు సమాచారం. కాగా స్టేషన్‌ఘన్‌పూర్‌లో కడియం శ్రీహరి అభ్యర్థిత్వం ఖరారైన నేపథ్యంలో నిర్వహించిన భారీ సభకు ఎమ్మెల్యే రాజయ్య గైర్హాజరు కావడం పార్టీ నాయకులు, కార్యకర్తల్లో చర్చకు దారితీసింది.

స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గంలోనూ వివాదం సద్దుమణగడం లేదు. ఆ స్థానంపై సిట్టింగ్ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరెడ్డి, ఎమ్మెల్సీలు పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి, పల్లా రాజేశ్వర్ రెడ్డిలు పట్టు వీడటం లేదు. ఉమ్మడి వరంగల్‌లో 11 స్థానాలను ప్రకటించిన కేసీఆర్.. ఆ ఒక్క సీటుపై ఈ నెల 25న నిర్ణయం తీసుకుంటామని ప్రకటించిన విషయం తెలిసిందే. ఇదే సమయంలో టికెట్ ప్రయత్నాల్లో భాగంగా మంత్రి హరీష్‌రావు, ఎమ్మెల్సీ కవితలను కలిసిన ముత్తిరెడ్డి నియోజకవర్గంలో విస్తృతంగా తిరుగుతున్నారు. పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి నియోజకవర్గంలో తిరగడంతో పాటు ఎమ్మెల్సీగా తాను జనగామ నియోజకవర్గానికి కేటాయించిన నిధులు, చేసిన పనులను వివరిస్తూ కేసీఆర్, కేటీఆర్‌ల ఆశీస్సులతో క్రమశిక్షణ కలిగిన కార్యకర్తగా ప్రజలకు అందుబాటులో ఉంటున్నానంటూ వీడియో విడుదల చేయడం చర్చనీయాంశంగా మారింది. పల్లా రాజేశ్వర్‌రెడ్డి జనగామ నియోజకవర్గం ముఖ్యనేతలతో భేటీ అవుతూ టికెట్ కోసం ప్రయత్నాలు చేస్తున్నారు. కాగా అభ్యర్థులను ప్రకటించిన ఉమ్మడి వరంగల్‌లోని 10 స్థానాల్లో పరిస్థితి సర్దుకుపోగా.. జనగామ, స్టేషన్‌ఘన్‌పూర్‌లలో సద్దుమణగని వివాదాలు అధిష్టానంకు తలనొప్పిగా మారాయి.

అభివృద్ధి చేసేందుకే వస్తున్నా..



ర్యాలీలో అభివాదం చేస్తున్న కడియం శ్రీహరి

- కడియం శ్రీహరి

స్టేషన్‌ఘన్‌పూర్: నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసేందుకే వస్తున్నానని, రానున్న ఐదేళ్లలో నియోజకవర్గంలో కడియం శ్రీహరి మార్కు చూపిస్తానని ఎమ్మెల్సీ, బీఆర్ఎస్ పార్టీ స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గ అభ్యర్థి కడియం శ్రీహరి అన్నారు. అభ్యర్థిగా ప్రకటించిన తర్వాత మొదటిసారి స్టేషన్‌ఘన్‌పూర్‌కు వచ్చిన సందర్భంగా డివిజన్ కేంద్రంలో పార్టీ శ్రేణులు, కడియం అభిమానులు ఘన స్వాగతం పలికారు. రాజకీయ భిక్ష పెట్టిన ఘన్‌పూర్ నియోజకవర్గ ప్రజల రుణం తీర్చుకోలేనని, నిస్వార్థంగా అభివృద్ధి చేసేందుకు వస్తున్నానని, కోట్ల రూపాయలు కూడబెట్టుకునేందుకు కాదన్నారు. 30 ఏళ్లయ జీవితంలో అవినీతికి పాల్పడలేదన్నారు. అభివృద్ధిలో ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్‌రెడ్డి, మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, ఎమ్మెల్యే డాక్టర్ రాజయ్య సహకారం తీసుకుంటానన్నారు. పల్లా రాజేశ్వర్‌రెడ్డితో కలిసి ఎమ్మెల్యే రాజయ్య ఇంటికి వెళ్లామని, రాజయ్య అందుబాటులో లేరని, నియోజకవర్గంలో రాజయ్య సహకారం అవసరం ఉందన్నారు. రానున్న ఎన్నికల్లో నాయకులు, కార్యకర్తలు అందరూ కంకణబద్ధులై బీఆర్ఎస్ పార్టీ గెలుపే లక్ష్యంగా పనిచేయాలని, లక్ష ఓట్ల మెజార్టీ సాధించాలని కోరారు. అనంతరం పల్లా రాజేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ.. కడియం శ్రీహరి పనితనం, నీతి, నిజాయితీ గురించి నేను మీకు చెప్పాల్సిన అవసరం లేదని, అశేషంగా వచ్చిన జనాలే నిదర్శనమని అన్నారు. ఎమ్మెల్యే రాజయ్య కడియం మద్దతుగా వస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్మన్ సంపత్ రెడ్డి, నాయకులు ఎడవెల్లి క్రిష్టారెడ్డి, సీహెచ్.నరేందర్‌రెడ్డి, బెలిదె వెంకన్న, అన్నం బ్రహ్మారెడ్డి, బూర్ల శంకర్, నీల గట్టయ్య, వంశీధర్‌రెడ్డి, రాంబాబు, పోగుల సారంగపాణి, రజాక్ యాదవ్, దుంపల పద్మారెడ్డి, తెల్లాకుల రామక్రిష్ణతో పాటు నియోజకవర్గంలోని వివిధ మండలాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మీ మనస్సాక్షినే నమ్ముకోండి

- కేసీఆర్ నేర్పించిన విలువలతో కూడిన రాజకీయం చేస్తున్నా..
- సోషల్ మీడియాలో వైరల్‌గా మారిన ఎమ్మెల్సీ పోచంపల్లి ఆడియో



జనగామ: 'సీఎం కేసీఆర్.. మంత్రి కేటీఆర్ అడుగుజాడల్లో.. వారితో రెండున్నర దశాబ్దాలుగా ఉన్న అనుబంధంతో విలువలతో కూడిన రాజకీ యం చేస్తున్నా అని ఎమ్మెల్సీ, జనగామ బీఆర్ఎస్ టికెట్ ఆశిస్తున్న పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి ఆడియో ప్రసంగం బుధవారం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. జనగామ నియోజకవర్గ టికెట్ విషయంలో కేసీఆర్ పెండింగ్ ఉంచిన సంగతి తెలిసిందే. ప్రస్తుత ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి, ఎమ్మెల్సీలు పల్లా రాజేశ్వర్‌రెడ్డి, పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి ముగ్గురు పోటీ పడుతున్నారు. ఈ నేపథ్యంలో ప్రజాప్రతినిధులు, ప్రజలకు పోచంపల్లి మెసేజ్ రూపంలో పంపించిన ఆడియో చర్చనీయాంశంగా మారింది. '2019లో కేసీఆర్ ఆశీస్సులతో ఎమ్మెల్సీగా మీ ముందుకు వచ్చినప్పుడు దేశంలోనే రికార్డు స్థాయిలో 96.6శాతం ఓట్లతో గెలిపించి దీవించారు. ఇప్పుడు చూస్తున్న రాజకీయ పరిస్థితులను చూసి బాధేయడంతోనే ఇలా మీ ముందుకు రావడం జరిగింది. కొండా మురళి గెలిచిన తర్వాత కనిపించకుండా పోయింది నేను కాదు. కేసీఆర్, కేటీఆర్ చెప్పిన విధంగా ఎప్పుడూ ప్రజలు , ప్రజాప్రతినిధులు, నమ్ముకున్న వారికి అందుబాటులో ఉండడమే నేర్చుకున్నా. అందరికీ రోల్‌మోడల్‌గా ఉండాలని, గతంలో ఎమ్మెల్సీ ఎన్నికలు ముగిసిన వెంటనే ఇచ్చిన ప్రతి హామీని నిలబెట్టుకున్నా . ప్రస్తుత రాజకీయాలు పార్టీకి నష్టం కలిగించే వి ధంగా ఉన్నాయి. మీ అంతరాత్మ ఏది చెబితే అలా నడుచుకోండి... లేదంటే వచ్చే స్థానిక సంస్థల ఎన్ని కల్లో ఇలాంటి రాజకీయాలు మీ ముందుకు కూడా రావచ్చు. ఒకరు రూపాయి ఇస్తే... నాలుగు రూపాయలు ఇచ్చే కెపాసిటీ నాకుంది.. విలువలతో కూడి న రాజకీయాలు చేయాలని కేసీఆర్, కేటీఆర్ చెప్పిన మాట ప్రకారం నడుచుకుంటున్నా. ఆహ్లాద కరమైన రాజకీయాలు మనందరికీ మేలు చేస్తాయి. కేసీఆర్ ఎవరు నిర్ణయిస్తే, వారిని గెలిపించుకునే బాధ్యత మనందరిపై ఉంది. అంతరాత్మ నిర్దేశించిన ప్రకా రం ఎవరికైనా సపోర్టు చేయవచ్చు... కానీ ప్రజలు మనకు కల్పించిన అధికారం , జరిగే అభివృద్ధి వారి కి ఎప్పుడూ కనిపించాలి. మనస్సాక్షి చెప్పినట్లు నడుచుకోవాలన్నదే నా ఉద్దేశం' అని ఆడియోలో ప్రసంగం ముగించారు.

'పల్లా' వర్గం భేటీ



పార్టీ కార్యాలయంలో భేటీ అయిన పల్లా వర్గం

జనగామ: యశ్వంతాపూర్‌లోని బీఆర్ఎస్ జిల్లా పార్టీ కార్యాలయంలో బుధవారం పల్లా రాజేశ్వర్‌రెడ్డి వర్గం భేటీ అయింది. పీఏసీఎస్ చైర్మన్ నిమ్మతి మహేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో జెడ్పీటీసీ నిమ్మతి దీపిక, మున్సిపల్ చైర్‌పర్సన్ పోకల జమునలింగయ్య, కౌన్సిలర్ బండ పద్మ, బండ యాదగిరిరెడ్డితో పాటు 8 మండలాల నాయకులు తరలివచ్చారు. కడియం శ్రీహరికి స్వాగతం పలికిన తర్వాత, పల్లా రాజేశ్వర్‌రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నిమ్మతి మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ జనగామ టికెట్ పల్లాకే వస్తుందని దీమా వ్యక్తం చేశారు.

సీఎం పర్యటనకు పకడ్బందీ ఏర్పాట్లు

- 4న పాలకుర్తికి రాక
- 26న సామూహిక హరితహారం
- సమీక్షలో కలెక్టర్ శివలింగయ్య

జనగామ: పాలకుర్తి నియోజకవర్గంలో సెప్టెంబర్ 4వ తేదీన సీఎం కేసీఆర్ పర్యటించనున్న నేపథ్యంలో ఏర్పాట్లు పకడ్బందీగా చేపడుతుందని కలెక్టర్ సీహెచ్ శివలింగయ్య అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లోని సమావేశం హాల్‌లో అదనపు కలెక్టర్లు రోహిత్ సింగ్, సుహాసిని, సంబంధిత అధికారులతో కలిసి కలెక్టర్ శివలింగయ్య కేసీఆర్ పర్యటన ఏర్పాట్లపై సమీక్షించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. 4వ తేదీన పాలకుర్తి మండలంలోని వల్మిడి శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయ పునఃప్రతిష్ఠాపన, నియోజకవర్గంలో చేపట్టిన పర్యాటక ప్రాంతాల అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేసేందుకు ముఖ్యమంత్రి వస్తున్నట్లు పేర్కొన్నారు. సెప్టెంబర్ 1వ తేదీ నుంచి 4 తేదీ వరకు ఆలయంలో ప్రత్యేక కార్యక్రమాలు జరుగుతాయన్నారు. ప్రత్యేక కంట్రోల్ రూం పర్యవేక్షణలో హెలీప్యాడ్ పరిశీలన చేసి, ఫైర్ సేఫ్టీ అన్ని సౌకర్యాలతో వైద్య శిబిరాలు తదితర వాటిని ఏర్పాటు చేయాలన్నారు. వచ్చే నెల 1 నుంచి 4 వరకు నాలుగు రోజుల పాటు ఉత్సవాల కోసం వల్మిడికి పాలకుర్తి చుట్టూ ఉన్న తొర్రూర్, హనుమకొండ, వరంగల్, జనగామ డిపోల నుంచి ప్రత్యేక బస్సులను నడిపించాలన్నారు. హరితహారంలో భాగంగా ఈనెల 26వ తేదీన జిల్లా వ్యాప్తంగా సామూహిక హరితహారం (మొక్కలు నాటే కార్యక్రమం) నిర్వహించాలని కలెక్టర్ కోరారు. ఆర్డీఓలు రామ్మూర్తి, మురళీకృష్ణ, డీఆర్డీఓ రాంరెడ్డి, డీపీఓ రంగాచారి, జెడ్పీ సీఈఓ అనిల్ కుమార్, సీపీఓ ఇస్మాయిల్, ఎన్పీడీసీఎల్ ఎస్ఈ వేణుమాధవ్ ఉన్నారు.

నంబర్ వన్‌గా నిలవాలి

జనగామ చంపక్‌హిల్స్ మాతా శిశు సంరక్షణ ఆరోగ్య కేంద్రంలో ప్రసవాల సంఖ్య పెంచి నంబర్ వన్‌గా నిలవాలని కలెక్టర్ సీహెచ్ శివలింగయ్య అన్నారు. మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ గోపాల్‌రావు, ఎంసీహెచ్, జిల్లా ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో నూతనంగా బాధ్యతలు చేపట్టిన సూపరింటెండెంట్లు డాక్టర్ మధుసూదన్‌రెడ్డి, డాక్టర్ అనురాధ, డీసీహెచ్ఎస్ డాక్టర్ సుగుణాకర్‌రాజుతో కలిసి కలెక్టర్ డెలివరీలు, జనరల్ సేవలు తదితర వాటిపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. 27వ స్థానంలో ఉన్న ఎంసీహెచ్‌ను స్టేట్‌లో టాప్ పొజిషన్‌లో ఉండేలా చూడాలన్నారు. ఎంసీహెచ్‌లో మంచినీటి సౌకర్యం కల్పించాలని అధికారులను ఆదేశించారు. జిల్లా ఆస్పత్రిలో బయోమెట్రిక్ సేవలు తప్పనిసరి అని కలెక్టర్ ఆదేశించారు. నేను తనిఖీ చేసేసమ యంలో స్తానన్నారు. తన పరిశీలనలో డ్యూటీ డాక్టర్, సిబ్బంది లేకుంటే సస్పెండ్ చేస్తామని హెచ్చరించారు. ప్రతి డాక్టర్ స్థానికంగా ఉండాలని ఆదేశించారు. చంపక్ హిల్స్‌లోని డీఆర్డీఏ భవనాన్ని ఎంసీహెచ్‌కు ఇవ్వాలని మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ గోపాల్‌రావు కోరగా, కలెక్టర్ గ్రీన్ సిగ్నల్ ఇస్తూ.. డీఆర్డీఓ రాంరెడ్డికి ఆదేశాలు జారీ చేశారు. గర్ల్స్ హాస్టల్ పనులు ఎంత వరకు వచ్చాయనే దానిపై ఆరా తీశారు.



సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ శివలింగయ్య

'చెలిమి'తో విద్యార్థుల్లో సృజనాత్మకత

- డీఈఓ రాము

జనగామ రూరల్: చెలిమితో విద్యార్థుల్లో సృజనాత్మకత పెరుగుతుదని డీఈఓ రాము అన్నారు. బుధవారం డీఈఓ కార్యాలయంలో చెలిమి కార్యక్రమానికి సంబంధించిన వాల్ పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డీఈఓ మాట్లాడుతూ.. చెలిమి సామాజిక కార్యక్రమంలో భాగంగా విద్యార్థుల్లో సామాజిక దృక్పథం, భావోద్వేగాలు, తల్లిదండ్రులతో సంబంధాలు గుర్తించడం, నమ్మకం, భద్రత, అర్థం చేసుకోవడం, లక్ష్య సాధన, ఆత్మ గౌరవం, స్వీయ అన్వేషణ తదితర అంశాలపై 30 పీరియడ్ల పాఠాలు బోధించనున్నట్లు తెలిపారు. 6, 7 తరగతుల విద్యార్థుల కోసం ఇప్పటికే బ్రోచర్ రూపొందించామని పేర్కొన్నారు. పూర్తి కార్యాచరణతో త్వరలోనే అమలు చేయనున్నట్లు తెలిపారు. జిల్లా సైన్స్ అధికారి గౌసియా బేగం, చంద్రభాను పాల్గొన్నారు.

చట్టాలు హక్కులపై అవగాహన అవసరం

బాలలు చదువుతో పాటు చట్టాలు, హక్కులపై అవగాహన కలిగిఉండాలని డీఈఓ రాము అన్నారు. బుధవారం హ్యూమన్ రైట్స్ క్లబ్, పీపుల్స్ యాక్షన్ ఫర్ రూలర్ అవేకనింగ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో రెండు రోజులపాటు పట్టణంలోని ధర్మకంచ ఉన్నత పాఠశాలలో శిక్షణ కార్యక్రమం ప్రారంభించారు. ఈసందర్భంగా అంబేడ్కర్ మానవ హక్కులు, బాలల హక్కుల చరిత్ర, వంటి అంశాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ నిర్వహించారు. బాలలకు ఎదురయ్యే సమస్యలు వాటి పరిష్కార పద్ధతులు, విద్యాభివృద్ధికి దోహదపడే అంశాలు విద్యార్థులకు వివరించారు. ఎంఈఓ భగవాన్‌దాస్, ఏఎంఓ శ్రీనివాస్, స్టేట్ కో ఆర్డినేటర్ నాగేష్, జిల్లా కోఆర్డినేటర్ సురేష్, టీం సభ్యులు శ్రీలత పాల్గొన్నారు.



వాల్ పోస్టర్ ఆవిష్కరిస్తున్న డీఈఓ రాము

క్లుప్తంగా

కాజీపేట మీదుగా వెళ్లే పలు రైళ్లు రద్దు

కాజీపేట రూరల్: కాజీపేట జంక్షన్ మీదుగా వివిధ మార్గాలలో ప్రయాణించే పలు రైళ్లను దక్షిణ మధ్య రైల్వే అధికారులు బుధవారం రద్దు చేశారు. విజయవాడ రూట్‌లో మూడో రైల్వే లైన్ నిర్మాణంలో భాగంగా చేపట్టిన ట్రాఫిక్ కమ్ పవర్ నాన్ ఇంటర్ లాకింగ్ బ్లాక్ చేపట్టిన కారణంగా పలు రైళ్లను కొన్ని రోజుల పాటు రద్దు చేసినట్లు స్థానిక రైల్వే అధికారులు తెలిపారు.

రద్దయిన రైళ్లు ఇవే..

సంబల్‌పూర్–నాందేడ్ (20809) ఎక్స్‌ప్రెస్ ఆగస్టు 25, 27, 28వ తేదీల్లో, నాందేడ్–సంబల్‌పూర్ (20810) ఎక్స్‌ప్రెస్ 26, 28, 29వ తేదీల్లో, విశాఖపట్నం–నాందేడ్ (20811) ఎక్స్‌ప్రెస్ 26,29వ తేదీల్లో, నాందేడ్–విశాఖపట్నం (20812) ఎక్స్‌ప్రెస్ 27,30వ తేదీల్లో రద్దు చేసినట్లు కాజీపేట రైల్వే అధికారులు తెలిపారు.

మోడల్ రైల్వే బంగ్లాలు ప్రారంభం



రైల్వే బంగ్లాలను ప్రారంభిస్తున్న డీఆర్‌ఎం

కాజీపేట రూరల్: కాజీపేట జంక్షన్‌లో అధికారుల కోసం నిర్మించిన మూడు మోడల్ రైల్వే బంగ్లాలను దక్షిణ మధ్య రైల్వే సికింద్రాబాద్ డివిజన్ డీఆర్‌ఎం భర్తేష్‌కుమార్ జైన్ బుధవారం ప్రారంభించారు. బెల్లంపల్లి–కాజీపేట జంక్షన్ తనిఖీలో భాగంగా డీఆర్‌ఎం కాజీపేట జంక్షన్‌కు చేరుకున్నారు. అనంతరం రైల్వే ఎలక్ట్రిక్ లోకోషెడ్ కాలనీలో మెయిన్‌రోడ్‌లో నిర్మించిన మూడు మోడల్ రైల్వే బంగ్లాలను ప్రారంభించారు. అద్భుత బంగ్లాల నిర్మాణానికి కృషి చేసిన అధికారుల బృందాన్ని అభినందించి రూ.10 వేల క్యాష్ అవార్డు ప్రకటించారు. అనంతరం రైల్వే డ్రైవర్ల కార్యాలయం సమీపంలో ఆన్‌లైన్ డ్రైవర్ల విశ్రాంతి కోసం నిర్మించనున్న మోడల్ రన్నింగ్ రూమ్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో సికింద్రాబాద్ డీఈఎన్ కో ఆర్డినేషన్ కృష్ణారెడ్డి, సీనియర్ డీఈఈ ఎస్.ఎస్.వి.ప్రసాదరావు, సీనియర్ డీఈఈ నవీన్‌కుమార్, డీఈఎన్ సెంట్రల్ ప్రంజల్ కేశర్‌వాణి, కాజీపేట డీజిల్‌షెడ్ సీనియర్ డీఎంఈ సందీప్‌కుమార్, కాజీపేట ఏడీఈఎన్‌లు ఎంఆర్ కె.రాజు, విష్ణు చౌదరి, తదితరులు పాల్గొన్నారు.

బది'లీలలు'

ముడుపులు అందజేసి నచ్చిన చోట పోస్టింగ్

- రిజిస్ట్రేషన్ శాఖలో భారీగా స్థానచలనం
- ఉమ్మడి వరంగల్ జిల్లా దాటని సబ్ రిజిస్ట్రార్లు
- మ్యూచువల్‌ను తలపిస్తున్న బదిలీలు
- చక్రం తిప్పిన ఉద్యోగ సంఘాల నేతలు



కాజీపేట అర్బన్ : తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా రిజిస్ట్రేషన్ శాఖలో భారీగా బదిలీలు చేపడుతూ రాష్ట్ర ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఇందులో భాగంగా ఉమ్మడి వరంగల్ జిల్లాలో డీఐజీ, సబ్ రిజిస్ట్రార్ గ్రేడ్–1,గ్రేడ్–2 స్థాయిలో బది'లీలలు' జరిగాయి. పదేండ్లకు పైబడి ఒకే స్థానంలో విధులు నిర్వహిస్తున్న సబ్ రిజిస్ట్రార్లకు స్థానచలనం కల్పించేందుకు చేపట్టిన బదిలీల్లో భారీగా ముడుపులు చేతులు మారినట్లు సమాచారం. ఉన్నతాధికారుల ఆశీర్వాదంతో నచ్చిన దగ్గర పోస్టింగ్ పొందినట్లు రిజిస్ట్రేషన్ శాఖలో ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ఎట్టకేలకు కదిలారు..

ఉమ్మడి వరంగల్ జిల్లాలోని 13 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఏండ్లుగా లాంగ్ స్టాండింగ్‌లో విధులు కొనసాగిస్తున్న సబ్ రిజిస్ట్రార్లు ఎట్టకేలకు బుధవారం వెలువడిన బదిలీలతో కదిలారు.

ఉమ్మడి వరంగల్ జిల్లా దాటని సబ్‌రిజిస్ట్రార్లు..

ఉమ్మడి వరంగల్ జిల్లాలో లాంగ్‌స్టాండింగ్‌లో విధులు నిర్వహిస్తున్న సబ్ రిజిస్ట్రార్ గ్రేడ్–1,గ్రేడ్–2 అధికారులు మల్టీ జోన్–1లో భాగంగా రంగారెడ్డి జిల్లాకు బదిలీ అయ్యే అవకాశం ఉంది. అయితే ఉన్నతాధికారుల అండతో ఉమ్మడి వరంగల్ జిల్లా దాటకుండా తాము ఎంచుకున్న రిజిస్ట్రేషన్ కార్యాలయంలో పోస్టింగ్ సాధించారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని 13 రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో గ్రేడ్–1,గ్రేడ్–1 సబ్ రిజిస్ట్రార్ల బదిలీలు మ్యూచువల్‌ను తలపించాయి. వరంగల్ ఆర్వోలో విధులు నిర్వహిస్తున్న సంపత్‌కుమార్ జనగామ, జనగామలో విధులు నిర్వహిస్తున్న అమ్జద్‌అలీ వరంగల్ ఆర్వో, ములుగు సబ్‌రిజిస్ట్రార్ తస్లీమా మహబూబాబాద్, వరంగల్ ఫోర్ట్‌లో విధులు నిర్వహిస్తున్న మసీయుద్దీన్ వరంగల్ రూరల్, వరంగల్ రూరల్‌లో విధులు నిర్వహిస్తున్న సుజాత డీఐజీ కార్యాలయానికి , నర్సంపేటలో విధులు నిర్వహిస్తున్న కార్తీక్ వరంగల్ రూరల్‌కు కేటాయించారు. ఈ విధంగా ఏ అధికారి కూడా ఉమ్మడి వరంగల్ జిల్లా దాటలేదు.

చక్రం తిప్పిన ఉద్యోగ సంఘాల నాయకులు..

ఉమ్మడి వరంగల్ జిల్లాలోని గ్రేడ్–1,గ్రేడ్–2 సబ్ రిజిస్ట్రార్ల బదిలీల్లో ఉద్యోగ సంఘాల నేతలు చక్రం తిప్పి ఉమ్మడి వరంగల్ దాటకుండా అడ్డుపడ్డారని తెలుస్తోందని పలువురు పేర్కొన్నారు. భారీగా బదిలీలు జరుగుతాయనే సమచారంతో లాంగ్ స్టాండింగ్ గ్రేడ్–1,గ్రేడ్–2 సబ్ రిజిస్ట్రార్లు లాంగ్ లీవ్ పెట్టి హైదరాబాద్‌కు మకాం మార్చి ఉన్నతాధికారుల అధికారుల ఆశీర్వాదం కోసం ఉద్యోగ సంఘాల నేతలతో జతకట్టారు.

బదిలీలు ఇలా...

ఉమ్మడి వరంగల్ జిల్లాలోని 13 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో డీఐజీ, సబ్ రిజిస్ట్రార్ గ్రేడ్–1,గ్రేడ్–2 అధికారులను బదిలీ చేస్తూ రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్ శాఖ ఐజీ నవీన్ మిత్తల్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు.

వరంగల్ డీఐజీగా – ఎం.సుభాషిణి
మహబూబాబాద్–తస్లీమా మహమ్మద్
జనగామ–టి.సంపత్‌కుమార్
వరంగల్ రూరల్–మసీయుద్దీన్
వరంగల్ ఫోర్ట్– ఏ.కార్తీక్
వరంగల్ ఆర్వో–ఎండీ.అమ్జద్ అలీ
నర్సంపేట– రామ కిశోర్ రెడ్డి
డీఐజీ కార్యాలయం–డి.సుజాత

ఉమ్మడి వరంగల్‌లో లాంగ్ స్టాండింగ్ ఇలా..

గ్రేడ్–1 సబ్ రిజిస్ట్రార్లు..	గ్రేడ్–2 సబ్ రిజిస్ట్రార్లు..
ములుగు–13 సంవత్సరాలు	వరంగల్ ఫోర్ట్– 8 ఏళ్లు
వరంగల్ రూరల్–6	నర్సంపేట–8 ఏళ్లు
వరంగల్ ఆర్వో–4	జనగామ–9 ఏళ్లు
డీఐజీ కార్యాలయంలో సూపరింటెండెంట్–5	

దివ్యాంగులకు మరింత 'ఆసరా'



దివ్యాంగుడికి పింఛన్ పత్రాన్ని అందజేస్తున్న మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు. చిత్రంలో కలెక్టర్ శశాంక

- పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

తొర్రూరు: రాష్ట్ర ప్రభుత్వం.. దివ్యాంగులకు ఆసరా పింఛన్ పెంచి ఆదుకుంటోందని పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. బుధవారం డివిజన్ కేంద్రంలోని విశ్రాంతి భవనంలో దివ్యాంగులకు ఆసరా పింఛన్ల పెంపు పత్రాలు అందజేశారు. కలెక్టర్ కె. శశాంకతో కలిసి పలువురికి పెంచిన పింఛన్ల మొత్తాలను అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి ఎర్రబెల్లి మాట్లాడుతూ సీఎం కేసీఆర్ మానవీయ దృక్పథంతో దివ్యాంగులకు పింఛన్‌ను రూ.3016 నుంచి రూ.4016కు పెంచి ఆదుకుంటున్నారని తెలిపారు. 2014కు ముందు రూ.500 పింఛన్ మాత్రమే అందేదని..తొమ్మిదేండ్లలో ఎనిమిదింతలు పెరిగిందని గుర్తు చేశారు. తెలంగాణలో ఇ స్తున్న పింఛన్లు మరే రాష్ట్రంలో ఇవ్వడం లేదన్నారు. రాష్ట్రంలో 40 లక్షల మందికి పింఛన్లు అందుతున్నాయన్నారు. బీజేపీ, కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో ఎ క్కడా తెలంగాణలో ఇస్తున్న పింఛన్లు అమలు కావడం లేదన్నారు. వృద్ధాప్య పింఛన్ వయసును 2020 మార్చిలో 60 ఏండ్ల నుంచి 57 ఏళ్లకు తగ్గించిందని గుర్తు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు పేదలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటున్నాయన్నారు. అనంతరం తొర్రూరు ప్రభుత్వ ఆస్పత్రిని 100 పడకలకు అప్‌గ్రేడ్ చేయగా దీని నిర్మాణానికి స్థల పరిశీలన చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మంగళపల్లి రామచంద్రయ్య, తొర్రూరు, పెద్దవంగర ఎంపీపీలు చిన్న అంజయ్య, రాజేశ్వరి, జెడ్పీటీసీలు శ్రీనివాస్, జ్యోతిర్మయి, పాలకుర్తి దేవస్థాన చైర్మన్ రామచంద్రయ్యశర్మ పాల్గొన్నారు.

సీఎం కేసీఆర్ మాటలన్నీ అబద్ధాలే



మోకాళ్లపై నిలబడి నిరసన తెలుపుతున్న రెండో ఏఎన్‌ఎంలు

- సివిల్ సప్లై హమాలీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు మునీశ్వర్

హన్మకొండ: సీఎం కేసీఆర్.. పూటకో మాట మాట్లాడుతారని, అవీ అబద్ధాలే చెబుతారని ఏఐటీయూసీ అనుబంధ సివిల్ సప్లై హమాలీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు గుంపెల్లి మునీశ్వర్ విమర్శించారు. తమకు ఉద్యోగభద్రత కల్పిస్తూ, క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేస్తూ రెండో ఏఎన్‌ఎంలు చేపట్టిన నిరవధిక సమ్మె బుధవారం 8వ రోజుకు చేరుకుంది. హనుమకొండ బాలసముద్రంలోని ఏకశిల పార్కువద్ద చేపట్టిన దీక్షలో భాగంగా మోకాళ్లపై నిలబడి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మునీశ్వర్ మాట్లాడుతూ సీఎం కేసీఆర్.. కరోనా సమయంలో ఏఎన్‌ఎంలను దేవుళ్లతో పోల్చారని, ఇప్పుడు పట్టించుకోకపోవడం బాధాకరమన్నారు. ఏఐటీయూసీ వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి గన్నారపు రమేష్ మాట్లాడుతూ తెలంగాణ వస్తే అవుట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగులందరినీ పర్మనెంట్ చేస్తామని చెప్పి.. నేడు మాట తప్పుతున్నారని మండిపడ్డారు. ఏఐటీయూసీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు చెన్నకేశవులు, ఉపాధ్యక్షులు యాకోబు, విక్టోరియా, సుమలత, నాయకురాళ్లు సుజాత, రజిత, తదితరులు పాల్గొన్నారు.

యువతులను మోసం చేసిన వ్యక్తి అరెస్ట్



నిందితుడి అరెస్ట్ చూపుతున్న ఏసీపీ డేవిడ్ రాజు

వరంగల్ క్రైం/హసన్‌పర్తి: షేర్ చాట్, స్నాప్ చాట్ యాప్‌ల ద్వారా యువతులను మోసం చేస్తున్న వ్యక్తిని హసన్‌పర్తి పోలీసులు అరెస్ట్ చేసి ఓ యువతిని కాపాడారని కాజీపేట ఏసీపీ డేవిడ్‌రాజు తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లోని సత్యసాయి జిల్లా కలమర్ల గ్రామానికి చెందిన ఇమ్రాన్ సులభంగా డబ్బు సంపాదించాలనే ఆలోచనతో షేర్‌చాట్, స్నాప్ చాట్ యాప్‌ల ద్వారా మహిళలు, యువతులతో చాటింగ్ చేయడానికి ప్రణాళికలు రచించాడు. ఇందులో భాగంగా హసన్‌పర్తి మండలానికి చెందిన ఓ యువతితో రెండు నెలల క్రితం షేర్ చాట్ ద్వారా పరిచయం పెంచుకున్నాడు. ఆ తరువాత వీడియో కాల్స్ ద్వారా మాట్లాడుతూ తాను ధనవంతుడినని, తన వద్దకు వస్తే ఇద్దరం కలిసి ఉందామని నమ్మించాడు. దీంతో సదరు యువతి ఈనెల 8వ తేదీన బంగారం తీసుకుని నిందితుడితో కలిసి జీవించేందుకు సత్యసాయి జిల్లాకు వెళ్లింది. అనంతరం ఆ బంగారాన్ని నిందితుడు ఓ ఫైనాన్స్ కంపెనీలో తాకట్టు పెట్టి రూ.1.50 లక్షల తన ఖాతాలోకి మళ్లించుకున్నాడు. ఇదిలా ఉండగా సదరు యువతి కుటుంబీకులు ఆమె అదృశ్యమైందని ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకున్న హసన్‌పర్తి పోలీసులు ఆధునిక టెక్నాలజీ ద్వారా యువతిని పట్టుకున్నారు. బుధవారం రైలులో కాజీపేట మీదుగా విజయవాడకు వెళ్తున్నట్లు గుర్తించిన పోలీసులు నిందితుడితో పాటు సదరు యువతిని అదుపులోకి తీసుకున్నారు. విచారించగా నిందితుడు నేరం ఒప్పుకోవడంతో అరెస్ట్ చేసినట్లు ఏసీపీ డేవిడ్‌రాజు తెలిపారు. అనంతరం పోలీసులు యువతిని కుటుంబీకులకు అప్పగించారు.

హత్యాయత్నం కేసులో నిందితుడికి జైలు

నెల్లికుదురు: హత్యాయత్నం కేసులో నిందితుడికి అసిస్టెంట్ సెషన్స్ జడ్జి సీహెచ్ సురేష్ జైలు శిక్షతో పాటు జరిమానా విధిస్తూ తీర్పు ఇచ్చినట్లు ఎస్సై కె.క్రాంతికిరణ్ బుధవారం తెలిపారు. మహబూబాబాద్ జిల్లా నెల్లికుదురు మండలం మీఠ్యాతండాలో 2016 సంవత్సరంలో తండాకు చెందిన గుగులోతు వీరన్న, వడివేలు సర్వనన్ అనే వ్యక్తి మధ్య భూవివాదంపై గొడవ జరిగింది. ఈ విషయంలో తనపై వీరన్న గొడ్డలితో హత్యాయత్నానికి పాల్పడ్డారని సర్వనన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. అప్పటి ఎస్సై జి.రాజుకుమార్ కేసు నమోదు చేసి చార్జిషీటు దాఖలు చేశారు. అసిస్టెంట్ సెషన్స్ జడ్జి సీహెచ్ సురేష్ కేసులోని సాక్షులను విచారించిన అనంతరం నిందితుడు వీరన్నకు 3 సంవత్సరాల జైలు శిక్షతో పాటు రూ.2వేల జరిమానా విధించినట్లు ఎస్సై క్రాంతికిరణ్ తెలిపారు.

పట్టపగలే వృద్ధుడి దారుణ హత్య

- భార్య కళ్ల ఎదుటే కత్తితో గొంతుకోసిన దుండగులు
- భూ వివాదమే హత్యకు కారణమంటున్న మృతుడి బంధువులు
- వరంగల్ నగరంలో ఘటన



రాంచందర్ (ఫైల్)



రాంచందర్ మృతదేహంపై పడి రోదిస్తున్న భార్య, కుమార్తె, కుమారులు

ఖిలా వరంగల్: వరంగల్ నగరంలోని కరీమాబాద్ ఎస్ఆర్ఆర్‌తోటలో బుధవారం ఉదయం ఓ వృద్ధుడు దారుణ హత్యకు గురయ్యాడు. గుర్తు తెలియని వ్యక్తులు ఇంట్లోకి ప్రవేశించి భార్య కళ్లెదుటే వృద్ధుడిని కత్తితో గొంతు కోసి పరారయ్యారు. భూ వివాదమే హత్యకు కారణమని మృతుడి బంధువులు ఆరోపిస్తున్నారు. మృతుడి బంధువులు, స్థానికుల కథనం ప్రకారం.. ఎస్ఆర్ఆర్‌తోటకు చెందిన నాముతాబాజీ రాధాబాయ్, రాంచందర్(65) దంపతులకు ముగ్గురు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. రాంచందర్ ఆర్టీసీలో కండక్టర్‌గా విధులు నిర్వహించి రిటైరయ్యారు. పదేళ్ల క్రితమే ఎస్ఆర్ఆర్‌తోటలో ఇల్లు కట్టుకొని స్థిరపడ్డారు. పిల్లలకు పెళ్లిళ్లై వేర్వేరు చోట్ల స్థిరపడ్డారు. ప్రస్తుతం రాధాబాయ్, రాంచందర్ మాత్రమే ఎస్ఆర్ ఆర్‌తోటలోని ఇంట్లో నివాసం ఉంటున్నారు. రాంచందర్‌కు పరకాల నియోజకవర్గం పత్తిపాక శాయంపేట గ్రామంలో 1.20గుంటల వ్యవసాయ భూమి ఉంది. ఈ భూమి విషయమై స్థానికుడి నడమ వివాదం కొనసాగుతోంది. ఈ విషయంపై శాయంపేట పోలీస్‌స్టేషన్‌లో కేసు కూడా నమోదైంది. ఈ క్రమంలో బుధవారం ఉదయం సుమారు 11.20 నిమిషాలకు గుర్తు తెలియని వ్యక్తులు ఎస్ఆర్‌తోటలో రాంచందర్ పేరు పెట్టి పిలుస్తూ ఇంట్లోకి ప్రవేశించారు. ఎవరో వచ్చారు అని భార్య రాధాబాయ్ చెప్పగానే బెడ్రూం నుంచి హాల్‌లోకి ప్రవేశించిన రాంచందర్‌ను దుండగులు కింద పడేసి వెంట తెచ్చుకున్న కత్తితో గొంతుకోసి పరారయ్యారు. ఆ దృశ్యం చూసిన భార్య షాక్‌కు గురైంది. రక్షించండి అంటూ రాంచందర్ ఇంట్లోనుంచి రోడ్డుపైకి చేరి రక్తపు మడుగులో కుప్పకూలి అక్కడికక్కడే చనిపోయాడు. విషయం తెలిసిన వెంటనే మిల్స్‌కాలనీ ఇన్‌స్పెక్టర్ సురేష్.. ఎస్సై శ్రీలత, సిబ్బందితో కలిసి ఘటన స్థలానికి చేరుకున్నారు. హత్య జరిగిన తీరును పరిశీలించారు. మృతుడి బంధువులు, స్థానికుల నుంచి వివరాలు సేకరించారు. మృతదేహాన్ని ఎంజీఎం మార్చురీకి తరలించారు. మృతుడి పెద్ద కుమారుడు నాము తాబాజీ ప్రదీప్ చందర్ మిల్స్‌కాలనీ పోలీసులకు ఫిర్యాదు చేయగా హత్యా నేరం కింద కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నట్లు ఇన్‌స్పెక్టర్ టి.సురేష్ తెలిపారు.

భూ వివాదమే హత్యకు కారణమా..?

వృద్ధుడి హత్య అనేక అనుమానాలు రేకెత్తిస్తోంది. ఎవరితోనైనా ఆర్థిక లావాదేవీలు ఉన్నాయా..? పాత కక్షలు ఏమైనా ఉన్నాయా..? పత్తిపాక శాయంపేటలోని 1.20 గంటల భూ వివాదమే హత్యకు కారణమా..? భూ వివాదంపై పట్టు వీడడం లేదనే కక్షతో గుర్తుతెలియని వ్యక్తులు గొంతు కోసి హత్య చేసి ఉంటారా..? అనే కోణాల్లో పోలీసులు విచారిస్తున్నారు. పత్తిపాక శాయంపేటకు చెందిన ఓ వ్యక్తికి రాంచందర్ నడమ భూవివాదం ఉందని, మృతుడి కుమారుడు ప్రదీప్ చందర్ చెప్పడంతో సదరు వ్యక్తి ఆచూకీ కోసం పోలీసులు గాలిస్తున్నట్లు సమాచారం. హత్య చేసి పరారైన వ్యక్తులు ముందుగా ఎక్కడినుంచి ఇంటికి చేరుకున్నారు..? ఆ తరువాత ఏ దారిలో వెళ్లి ఉంటారు..? అనే దానిపై సీసీ ఫుటేజీలను సైతం పరిశీలించినట్లు తెలిసింది.

పంట రుణం చెల్లించలేదని..

- రైతుబంధు నగదు ఇవ్వని బ్యాంకు అధికారులు



రైతుబంధు నగదు ఇప్పించాలని వేడుకుంటున్న ఈరమ్మ, ఆమె కుమారుడు సంతోష్

బయ్యారం: పంట రుణం చెల్లించలేదని నెపంతో ఓ మహిళా రైతుకు బ్యాంకు అధికారులు రైతుబంధు నగదును నిలిపివేశారు. ఈ ఘటన మహబూబాబాద్ జిల్లా బయ్యారంలో జరిగింది. మండలంలోని గురిమెళ్లకు చెందిన మహిళారైతు గుగులోత్ ఈరమ్మకు ఏడు ఎకరాల పోడుభూమి ఉంది. 2007లో ఈరమ్మ బయ్యారంలోని అప్పటి ఆంధ్రాబ్యాంకు ప్రస్తుత యూనియన్ బ్యాంకులో రూ.50వేల పంట రుణం తీసుకుంది. ఆ తరువాత పోడుభూములకు రెవెన్యూ అధికారులు పహాణీలు ఇవ్వడం నిలిపివేశారు. దీంతో బ్యాంకులో రుణం రెన్యువల్ కాకుండా నిలిచింది. ఇటీవల ప్రభుత్వం పోడు పట్టాలు ఇవ్వడంతోపాటు రైతుబంధు నిధులు జమచేయడంతో సదరు మహిళా రైతు రైతుబంధు నగదు తీసుకునేందుకు కుమారుడు సంతోష్‌తో కలిసి బుధవారం బ్యాంకు వద్దకు వచ్చింది. అయితే బ్యాంకులో పంట రుణం చెల్లించలేదని, రైతుబంధు డబ్బులు ఇవ్వమని అధికారులు తెలపడంతో ఆందోళనకు గురైంది. రైతుబంధు డబ్బులు పెట్టుబడికి అవసరం అవుతాయనుకుంటే బ్యాంకు అధికారులు ఇవ్వడం లేదని, తనకు డబ్బులు ఇప్పించాలని అధికారులను వేడుకుంది. కాగా, ఈ విషయంపై బ్యాంకు అధికారులను సంప్రదించగా మేనేజర్ అందుబాటులో లేరని, ఆయన వచ్చిన తరువాత నిర్ణయం తీసుకుంటారని తెలిపారు.

బీసీలను వంచిస్తున్న పార్టీలు

- బీసీ రాజ్యాధికార సమితి అధ్యక్షుడు దాసు సురేశ్



బీసీ గర్జన పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

వరంగల్: బీసీ కులాలను రాజకీయ పార్టీలు వంచిస్తున్నాయని బీసీ రాజ్యాధికార సమితి అధ్యక్షుడు దాసు సురేశ్ ఆరోపించారు. బుధవారం వరంగల్ ఎల్‌బీనగర్‌లోని డీసెంట్ ఫంక్షన్‌హాల్‌లో ఓరుగల్లు బీసీ రాజ్యాధికార గర్జన ఆహ్వాన కమిటీ చైర్మన్ ధర్మపురి రామారావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో అత్యధిక జనాభా కలిగిన ముదిరాజ్ సామాజిక వర్గాన్ని బీఆర్ఎస్ ప్రకటించిన జాబితాలో పరిగణించకపోవడం, పద్మశాలీలను కేవలం ఒకే స్థానానికి పరిమితం చేయడం, విశ్వబ్రాహ్మణ, పెరిక, నాయీ బ్రాహ్మణ, కురుమ, కుమ్మరి వర్గాలకు ఏమాత్రం ప్రాతినిథ్యం కల్పించకపోవడం దేనికి నిదర్శనమని ప్రశ్నించారు. ఆగస్టు 27న వరంగల్‌లో జరిగే బీసీ రాజ్యాధికార గర్జనలో అన్ని కులాల ప్రతినిధులు పాల్గొంటున్నారని తెలిపారు. ఈగర్జలో ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో యుగేందర్‌యాదవ్, కేడల ప్రసాద్, చేపూరి ఓదెలు, ఆడేపు నగేష్‌నేత, చింతాల అనిల్, అల్లాడి యాకయ్య, కీర్తి జయంతి, సాంబరాజు ప్రభాకర్, కదారి రవి, పరిమళ లక్ష్మణ్, సదానందం, మడత కిశోర్, యాదగిరి, గీసబోయిన ఆకాష్, బేతి రమేష్, బేతి రాజు, సట్ల సాయి, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

దాతలూ.. ఆర్థిక చేయూతనందించండి

- జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారిణి వేడుకోలు



సంగీత

చిల్పూరు: జాతీయ స్థాయి షూటింగ్ బాల్ పోటీలకు ఎంపికైన ఓ క్రీడాకారిణి.. తనకు దాతలు ఆర్థిక చేయూతనందించాలని వేడుకుంటోంది. మండలంలోని చిన్నపెండ్యాలకు చెందిన దూడల సంగీత స్థానిక ప్రభుత్వ పాఠశాలలో 10వ తరగతి చదువుతోంది. ఈ క్రమంలో ఇటీవల నిర్వహించిన రాష్ట్ర స్థాయి షూటింగ్ బాల్ పోటీల్లో పాల్గొంది. అక్కడ ప్రతిభకనబరిచి అక్టోబర్ 5నుంచి 7వ తేదీ వరకు రాజస్థాన్‌లోని జైపూర్‌లో నిర్వహించే పోటీలకు రాష్ట్రం తరుపున ఎంపికైంది. అయితే పోటీలకు వెళ్లడానికి తనకు ఆర్థిక స్థోమత లేదని, దీనిపై దాతలు స్పందించి సాయం చేయాలని సంగీత కోరారు. సాయం చేయాలనుకునే వారు పీఈటీ వంశీ కృష్ణ 9000266996 నంబర్‌కు ఫోన్ పే లేదా గూగుల్ పే ద్వారా చేయూతనందించాలని కోరారు.

పేదింటి విద్యా కుసుమానికి ఎంబీబీఎస్ సీటు




మెడికల్ సీట్లు సాధించిన అక్కాచెల్లెళ్లు

నయీంనగర్: ఓ పేదింటి విద్యార్థిని నీట్ పరీక్షలో ఉత్తీర్ణత సాధించి ప్రభుత్వ కోటాలో ఎంబీబీఎస్ సీటు పొందింది. హనుమకొండ పోచమ్మకుంటకు చెందిన జనగాం సురేష్, కవిత దంపతుల కూతురు హరిప్రియ.. కన్వీనర్ కోటాలో భూపాలపల్లి ప్రభుత్వ మెడికల్ కళాశాలలో సీటు సాధించింది. గతంలో హరిప్రియ సోదరి జనగాం శరణ్యప్రియ కూడా కన్వీనర్ కోటాలోనే కొత్తగూడెం ప్రభుత్వ వైద్య కళాశాలలో సీటు సాధించడం విశేషం. ఒకే కుటుంబంలో అక్కాచెల్లెళ్లు ఎంబీబీఎస్ సీటు సాధించడంతో వారిని పలువురు అభినందించారు. కాగా, హనుమకొండ హనుమాన్‌నగర్ డబ్బాల సెంటర్‌లో చిన్న దుకాణం నడుపుకుంటూ ఇద్దరు కూతుళ్లను ఉన్నతంగా చదివిస్తున్న సురేష్‌ను పలువురు అభినందిస్తున్నారు.

రైలు ఢీకొని వృద్ధురాలి మృతి

- కడియం సభకు వస్తుండగా ఘటన..



కొమురమ్మ (ఫైల్)

స్టేషన్‌ఘన్‌పూర్: స్థానిక పాత రైల్వే గేట్ సమీపంలో కాలినడకన రైల్వే ట్రాక్‌ను దాటుతున్న ఓ వృద్ధురాలిని గుర్తు తెలియని రైలు ఢీకొట్టగా ఆమె అక్కడికక్కడే మృతిచెందింది. ఐనవోలు మండలం గర్మిళ్లపల్లికి చెందిన పిడుగు కొమురమ్మ(60) బుధవారం డివిజన్‌కేంద్రంలో నిర్వహించిన ఎమ్మెల్సీ కడియం శ్రీహరి సభకు వచ్చింది. కాగా, ఘన్‌పూర్, శివునిపల్లి జంటపట్టణాలకు కలిపేలా ఫ్లైఓవర్, అండర్ బ్రిడ్జి పూర్తయి వినియోగంలోకి రాగా కొద్ది నెలల క్రితం రైల్వేగేటు పూర్తిగా మూసివేశారు. అయితే పాదాచారులు పాత గేటు మార్గం గుండా వెళ్తున్నారు. ఈ క్రమంలో కొమురమ్మ పాతగేటు వద్ద నుంచి రైల్వేట్రాక్ దాటుతుండగా సికింద్రాబాద్ నుంచి ఖాజీపేటకు వెళ్తున్న గుర్తు తెలియని రైలు ఢీకొనడంతో అక్కడికక్కడే మృతిచెందింది. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు జీఆర్‌పీ ఎస్సై పరశురాములు తెలిపారు.

ఇద్దరు లారీ డ్రైవర్ల అరెస్ట్

- యజమానిపై కేసు నమోదు

వర్ధన్నపేట: లారీ.. ఆటోను ఢీకొన్న ఘటనలో ఆరుగురి మృతి చెందారు. ఈ ఘటనకు కారణమైన ఇద్దరు లారీ డ్రైవర్లను బుధవారం అరెస్ట్ చేసి రిమాండ్ తరలించామని వర్ధన్నపేట ఏసీపీ సురేష్ తెలిపారు. ఈ నెల 16వ తేదీన మండలంలోని ఇల్లంద గ్రామంలో లారీ.. ఆటోను ఢీకొనడంతో ఆరుగురు మృతి చెందారన్నారు. ఆ సమయంలో లారీ నడిపిన డ్రైవర్ మదన్‌లాల్ నాయక్‌కు డ్రైవింగ్ లైసెన్స్ లేదు. మరో డ్రైవర్ రాజేష్ మీనన్‌కు ఉన్నా గడువు తేదీ ముగిసిందన్నారు. దీంతో ఇద్దరిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామన్నారు. అలాగే, లారీ యజమాని కన్యాలాల్‌పై కూడా కేసు నమోదు చేశామని, ప్రస్తుతం ఆయన పరారీలో ఉన్నారని ఏసీపీ సురేష్ పేర్కొన్నారు.